లక్ష్మీనరసింహుడికి వైభవంగా నిత్యోత్సవాలు

నిత్య తిరుకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జూలై11: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో గురువారం స్వామి, అమ్మవార్ల నిత్యోత్సవాలు వైభవంగా జరిగాయి. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం వేళలో స్వామివారికి తిరువీధిసేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 6వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు స్వామివారిని దర్శించుకున్నారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 13,03,988 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశికధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందించాలి

- అదనపు కలెక్టర్ గాంగాధర్

ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గంగాధర్

రాజాపేట, జూలై11 : ప్రభుత్వం అందిస్తున్న పథకాలను లబ్ధిదారులకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ గంగాధర్ ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. గృహలక్ష్మి పథకం కింద ఉచిత విద్యుత్ లబ్ధిదారుల సంఖ్య, దరఖాస్తుల అన్‌లైన్ నమోదు పక్రియపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ నాగవేణి, తాసీల్దార్ దామోదర్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే డయల్ యువర్ చైర్మన్

- మున్సిపల్ చైర్మన్ పి.వెంకటేశ్వర్లు

డయల్ యువర్ చైర్మన్ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు

భువనగిరి అర్బన్, జూలై 11: మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికే డయల్ యువర్ చైర్మన్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు భువనగిరి మున్సిపల్ చైర్మన్ పి.వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన డయల్ యువర్ చైర్మన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఎక్కువగా పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, కోతులు, కుక్కల బెడద నివారించాలని ప్రజలు కోరినట్లు తెలిపారు. సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.రామాంజులరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో ఓపీజీ సేవలు ప్రారంభం

జ్యోతిప్రజ్వలన చేసి ఓపీజీ సేవలను ప్రారంభిస్తున్న ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా

బీబీనగర్, జూలై 11 : మండలంలోని బీబీనగర్ ఎయిమ్స్‌లో డెంటల్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓపీజీ మెషిన్‌ను గురువారం డైరెక్టర్ వికాస్ భాటియా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపీజీ మెషిన్ ద్వారా ఎగువ, దిగువ దవడలను స్కానింగ్ చేయడానికి, దంతాల సంఖ్య, స్థానం, పెరుగుదలను తెలుసుకోవడం సులువవుతుందన్నారు. అనంతరం ఆర్థోడెంటిక్స్, డెంటోఫేషియల్ ఆర్థోపెడిక్స్ డాక్టర్ అనురాగ్ నేగి రెండు సీట్లతో పీజీ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్లు రాహుల్ నారంగ్, అభిషేక్ అరోరా, సంగీతా సంపత్, బీపిన్ వర్గీస్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్. శ్యామల పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు

ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- మున్సిపాలిటీ ఎదుట కాంట్రాక్టు కార్మికుల ధర్నా

భువనగిరి అర్బన్, జూలై 11: కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని, కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలు, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి దాసరి పాండు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో భువనగిరి మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మాయ కృష్ణ, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఊదరి రామచందర్, నాయకులు లక్ష్మీ నారాయణ, బట్టు కొండయ్య, రవి, రాములు, యాదగిరి, రాజయ్య, నరసింహ, శ్రీధర్, కార్మికులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడికి సన్మానం

పీఈటీ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎంపీడీఓ

భూదాన్‌పోచంపల్లి, జూలై 11 : మండలంలోని జూలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న పీఈటీ బాల్తిని శ్రీనివాస్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా గురువారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రాపర్తి భాస్కర్‌గౌడ్ మాట్లాడుతూ పీఈటీగా శ్రీనివాస్ అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాకరి రేణుకానర్సింగ్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె. జెండగే

భువనగిరి కలెక్టరేట్, జూలై11 : అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా క్షేత్రస్థాయిలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, వైద్యాధికారులు, ఎంపీడీఓలు, పంచాయతీ అధికారులు, ఆరోగ్యశాఖ సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మున్సిపాలిటీలు, గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, గుంతలను పూడ్చాలని, బ్లీచింగ్, ఆయిల్‌బాల్స్, ఫాగింగ్ చేయడం ద్వారా దోమల నివారణకు కృషి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లోని మంచినీటి ట్యాంక్‌లను ప్రతి నెలా 1, 11, 21 తేదీల్లో తప్పనిసరిగా శుభ్రం చేసి, క్లోరినేషన్ చేపట్టాలని, 7 రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలన్నారు. దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని సూచించారు. వీధుల్లో పిచ్చి మొక్కలు, గడ్డి తొలగించాలన్నారు. వసతి గృహాలు, పాఠశాలల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో, పీహెచ్‌సీల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని సూచించారు. అధిక జనాభా వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించి చిన్న కుటుంబాల ప్రాముఖ్యతను తెలియజేయాలని ఆదేశించారు. అనంతరం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన వైద్యులకు, వైద్య సిబ్బందికి జిల్లా కలెక్టర్ మెమెంటోలు అందించారు. కార్యక్రమంలో జిల్లా స్థానికసంస్థల అదనపు కలెక్టరు కె.గంగాధర్, జడ్పీ సీఈఓ శోభారాణి, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ పాపారావు, జిల్లా పంచాయతీ అధికారి సునంద, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి

- లేక పోతే ఆమరణ నిరాహార దీక్ష చేపడతాం
- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె. జెండగే

యాదగిరిగుట్ట, జూలై11: బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్రహింసలకు గురి చేసిన పట్టణ సీఐ, ఎస్ఐ, కానిస్టేబుళ్లను వెంటనే సస్పెండ్ చేయాలని, రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాలను ఈ నెల 20లోగా తొలగించాలని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య డిమాండ్ చేశారు. లేక పోతే ఈ నెల 20 నుంచి రిలే నిరాహార దీక్ష చేపడతామని, అప్పటికీ స్పందించక పోతే ఆమరణ నిరాహార దీక్షకు కూడా సిద్ధమని ఆయన స్పష్టం చేశారు. గురువారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆమరణ నిరాహార దీక్షకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి రానున్నట్లు వెల్లడించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనతో ఏ పార్టీ నాయకులపై కేసులు పెట్టలేదని, చిత్ర హింసలు లేవని తెలిపారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో అందరితో కలిసి మెలిసి ఉన్నామన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడు నెలల లోపే పోలీస్‌స్టేషన్లు సెటిల్ మెంట్లకు అడ్డగా మారాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఏ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా కాంగ్రెస్ నాయకులే కనిపిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యేలో మాట్లాడి మీపైన కేసు లేకుండా చేస్తామని, కొంత ఖర్చువుతుందని చెబుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజల వద్ద నుంచి డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. తెలంగాణ తల్లి విగ్రహం వద్ద అక్రమ కట్టడాలను అడ్డుకున్న బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించారని, కళ్లల్లో కారంపోసి రబ్బర్ బెల్టుతో చితకబాదారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు న్యాయం చేయాలని డీజీపీ, డీసీపీ, సీఐతో పాటు ఇతర పోలీసు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే సామాన్య ప్రజలు బయటతిరిగే పరిస్థితి ఉండదన్నారు. కేసులు వెనక్కు తీసుకోవాలని లేకపోతే తీవ్ర పరిణామాలుంటాయని పోలీసులు, కాంగ్రెస్ నాయకులు బాధితులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. రోడ్లకు ఇరువైపులా రేకుల షెడ్లు నిర్మించిన వారి వద్ద నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు వేల రూపాయలు తీసుకుంటున్నారని ఆరోపించారు. వారు డబ్బులు తీసుకోలేదని స్వామివారి పాదాల వద్ద ప్రమాణం చేయాలని కోరినా ఇప్పటి వరకు ఏ ఒక్క కాంగ్రెస్ నాయకుడు స్పందించలేదన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని స్పష్టం చేశారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని తొలగించే ప్రయత్నం చేస్తున్నారని, ప్రశ్నించిన వారిపై పోలీసులు దాడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, నాయకులు ఆరె శ్రీధర్‌గౌడ్, చిత్తర్ల బాలయ్య, గడ్డం చంద్రం, దండెబోయిన వీరేశం, వాసం రమేశ్, బండి వాసు, బాధితులు తాళ్ల రాజేశ్వర్‌రెడ్డి, ఆకుల రాజశేఖర్, సాయి పాల్గొన్నారు.

హెచ్ఆర్‌సీకి ఫిర్యాదు

యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్ సీఐ, ఎస్ఐ, కానిస్టేబుళ్లు తమపై థర్డ్ డిగ్రీ అమలు చేసి, కారంపొడి చల్లి బెల్టుతో విచక్షణారహితంగా కొట్టారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితులు ఆకుల రాజశేఖర్, బోడి సాయి, తాళ్ల రాజేశ్వర్‌రెడ్డి గురువారం మానవ హక్కుల కమిషన్‌ను ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదును అందించారు. తెలంగాణ తల్లి విగ్రహం వద్ద అడ్డుగా అక్రమంగా షెడ్లను ఏర్పాటు చేస్తున్నారని, తొలగించాలని కోరినందుకు సీఐ రమేశ్, ఎస్ఐ జ్ఞానేందర్‌రెడ్డి తమను చిత్రహింసలకు గురిచేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ చేపట్టి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

హ్యాండ్లూం మార్కెట్ కమిటీ

భూదాన్‌పోచంపల్లి, జూలై11: మున్సిపాలిటీ కేంద్రంలోని ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ హ్యాండ్లూం మార్కెట్ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుండు శ్రీరాములు, ఉపాధ్యక్షుడిగా సంగెం భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా నామాల శ్రీనివాస్, కోశాధికారిగా సురపల్లి జగదీశ్, సహాయ కార్యదర్శిగా కస్తూరి భాస్కర్, కార్యవర్గ సభ్యులుగా ఈపూరి భాను, రుద్ర క్రాంతి, గర్దాసు కరుణాకర్, రుద్ర వినోద్, భోగ నటరాజ్, గుండేటి విజయ్ ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా చిట్టిప్రోలు శ్రీనివాస్, తడక రమేశ్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు రైతుభరోసా అందించాలి

- రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి బాలరాజు

బొమ్మలరామారం, జూలై11 : రాష్ట్రంలోని కౌలు రైతులకు కూడా రైతు భరోసాతో పాటు రుణ అర్హత కార్డులు అందించాలని రైతు సంఘం రాష్ట్ర సహాయకార్యదర్శి మాటూరి బాలరాజు ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని మర్యాల గ్రామంలో గురువారం కౌలు రైతుల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తమ మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా కౌలు రైతులకూ పథకాలు వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ర్యాకల శ్రీశైలం, నాయకులు దయాకర్, గుండె రంగస్వామి, సందెగళ్ల యాదగిరి, కొరమైన వెంకటయ్య, సురేశ్ పాల్గొన్నారు.

చీమలకొండూర్ కురుమ సంఘం ఎన్నిక

భువనగిరి కలెక్టరేట్, జూలై11: మండలంలోని చీమలకొండూర్ గ్రామ కురుమ సంఘం కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిన్నం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా శీల పాండు, ప్రధానకార్యదర్శిగా మంగ నవీన్, కోశాధికారిగా కరికి మల్లేశ్, కార్యవర్గ సభ్యులుగా శీల పర్వతాలు, మంగ శ్రీశైలం, ఎగ్గే కొమురయ్య, నారి శ్రీశైలం, కర్రె కరుణాకర్, మంగ స్వామి, మంగ పరశురాం ఎన్నికయ్యారు.

14 నుంచి ఎస్ఎఫ్ఐ రాజకీయ శిక్షణ తరగతులు

ఆలేరురూరల్, జూలై11 : ఈ నెల 14,15 తేదీల్లో భువనగిరిలో జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లా విద్య, వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కాసుల నరేశ్ కోరారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శిక్షణ తరగతుల కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు.

పనకబండ గ్రామంలో చుట్టు కాముడు ఆడుతున్న మహిళలు

వానలు కురువాలని చుట్టుకాముడు

మోత్కూరు, జూలై11: వానలు కురువాలని కోరుతూ మండలంలోని పనకబండ గ్రామంలో మహిళలు గురువారం చుట్టు కాముడు ఆడారు. గ్రామంలోని రచ్చబండ వద్ద చుట్టు కాముడు ఆడుతూ వరుణ దేవుడిపై పాటలు పాడారు. కార్యక్రమంలో స్థానికులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాలుష్య కారక కంపెనీలపై చర్యలు తీసుకోవాలి

- రామలింగంపల్లి గ్రామస్తుల ఆందోళన

కలుషిత నీరుతాగి మృతి చెందిన బర్రెను పరిశీలిస్తున్న వైద్యాధికారి, మాజీ ఎంపీటీసీలు

బొమ్మలరామారం, జూలై11 : రామలింగంపల్లి గ్రామ శివారులోని అష్టిమస్, బాలజీ కెమికల్ కంపెనీలు గ్రామంలోని రామయ్య చెరువులో వ్యర్థ జలాలను వదలడంతో ఆ నీటిని తాగి గొర్రెలు, పశువులు మృత్యువాత పడుతున్నాయని, సదరు కంపెనీలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు గ్రామపంచాలయతీ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చెరువులోని కలుషిత నీరు తాగడం వల్ల తిరుపతి అనే రైతుకు చెందిన పాడి గెదె మృతి చెందినట్లు తెలిపారు. సదరు రైతుకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రైతు ఫిర్యాదుతో ఎస్ఐ రాఘవేందర్‌గౌడ్ కేసు నమోదు చేశారు. జలాల్‌పూర్ పశువైద్యాధికారి అఖిల గేదెకు పోస్టుమార్టం నిర్వహించి శాంపిల్స్‌ను ఫోరెనిక్స్ ల్యాబ్‌కు పంపించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు యాంజాల సత్యనారాయణ, ఎర్వ తిరుపతి రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్. లింగోటంలో వాటర్ ప్లాంట్ ప్రారంభం

వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కార్యదర్శి జ్యోతి

చౌటుప్పల్‌రూరల్, జూలై11 : చౌటుప్పల్ మండలం ఎస్. లింగోటం గ్రామంలో దివీస్ పరిశ్రమ సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్ ప్లాంట్‌ను గురువారం గ్రామ కార్యదర్శి బి, జ్యోతి ప్రారంభించారు. నాయకులు, దివీస్ అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

రామన్నపేట(వలిగొండ), జూలై11: మండలంలోని సుంకిశాల గ్రామానికి చెందిన ఈర్లపల్లి భిక్షపతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి కుటుంబానికి గురువారం పైళ్ల వెంకట్‌రెడ్డి, శాలిని దంపతులు రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పైళ్ల రాజవర్ధన్ రెడ్డి, వరకాంతం రాజేందర్‌రెడ్డి, పాల ఉత్పత్తి దారుల సహకార సంఘం చైర్మన్ తుమ్మల సత్యనారాయణరెడ్డి, చెరుకు శివయ్య, నర్సింహ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తిరమలేశ్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత

బీఆర్ఎస్ నాయకులకు మాజీ ఎమ్మెల్యే సునీత పరామర్శ

గుండాల, జూలై 11: మండలంలోని వెల్మజాల గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు సంగి బాల కొమురయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు నిమ్మల మాధవరెడ్డి కూడా ఇటీవల పాముకాటుకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి గురువారం గ్రామానికి వెళ్లి ఇరువురిని పరామర్శించారు. కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామని ఆమె పేర్కొన్నారు.

బీఆర్ఎస్ మండలాధ్యక్షుడికి సన్మానం

రాజాపేట : బీఆర్ఎస్ మండలాధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన సట్టు తిరుమలేశ్ గురువారం మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిరుమలేశ్‌ను మాజీ ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, మండల సెక్రెటరీ జనరల్ సందిల భాస్కర్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు బెడిదె వీరేశం, నాయకులు ఉపేందర్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ భగీరథ జలాలు

- ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్, జూలై 11 : మిషన్ భగీరథ నీటిని ప్రతి ఇంటికి సరఫరా చేస్తున్నామని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం మండలాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాపై సంబంధిత అధికారులతో మునుగోడులోని తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో నీటి సరఫరాపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. సమావేశంలో మిషన్‌భగీరథ డీఈ దీన్‌దయాల్ రావు, ఏఈలు అనూష, మహేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

జనాభా అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ పాపారావు

కాన్పుల మధ్య దూరం తల్లీబిడ్డకు శ్రేయస్కరం

- డీఎంహెచ్ఓ పాపారావు

భువనగిరి కలెక్టరేట్, జూలై11: కాన్పుల మధ్య కనీసం 3 సంవత్సరాల వ్యవధి పాటిస్తే తల్లీబిడ్డకు శ్రేయస్కరమని డీఎంహెచ్ఓ పాపారావు అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఆరోగ్య సిబ్బంది నిర్వహించిన అవగాహన ర్యాలీని గురువారం కలెక్టరేట్ వద్ద ఆయన ప్రారంభించి మాట్లాడారు. అధిక జనాభా వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించి చిన్న కుటుంబం ప్రాధాన్యతను తెలుపాలని సూచించారు. తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులతో కాన్పుల మధ్య ఎడం పాటించవచ్చునన్నారు. పురుషులు కోత, కుట్టులేని కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌కు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీహెంఎచ్ఓ డాక్టర్ ఎల్.యశోద, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రామకృష్ణ, సుమన్ కల్యాణ్, డెమో మధుసూదన్‌రెడ్డి, హెచ్ఈలు సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీలు

మోటకొండూర్ : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మండల వైద్యాధికారి విజయ్‌తో పాటు వైద్య సిబ్బంది మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఉత్తమ సేవలందించి కలెక్టర్ చేత ప్రశంసాపత్రాలు అందుకున్న ఏఎన్ఎం ధనమ్మ, ఆరోగ్య కార్యకర్త బోళ్ల స్వప్నను అభినందించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని పీహెచ్‌సీ వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పోతారెడ్డి, సూపర్‌వైజర్ శ్రీదేవి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైద్య సహాయ అధికారి స్వాతి, సీహెచ్ఓ కర్ణాకర్, సూపర్‌వైజర్లు సాంబులమ్మ, మర్యమ్మ, అజీజ్, సత్యానందం, సిబ్బంది పాల్గొన్నారు.

మోత్కూరు : మున్సిపాలిటీ కేంద్రంలో వైద్య సిబ్బంది, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ హేమంత్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

కోర్టు విధులను బహిష్కరించిన న్యాయవాదులు

రామన్నపేట, జూలై11: సిద్దిపేటలో న్యాయవాదిపై పోలీసులు దాడిని నిరసిస్తూ గురువారం రామన్నపేట కోర్టు న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఏ మజీద్ మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణకోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి కేమ రామదాసు, న్యాయవాదులు ఉయ్యాల హన్మంతుగౌడ్, మామిడి వెంకట్‌రెడ్డి, గాలి లింగయ్య, సత్తయ్య, శ్రవణ్, మొగలయ్య, డేవిడ్, టీ. జగత్, బాలరాజు, యాదయ్య, స్వామి పాల్గొన్నారు.

పాములకుంట ఉపాధ